సృజనాత్మక చిత్రలేఖనం అద్భుత కళ



ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైవిధ్యభరిత బొమ్మలు గీయడం సృజనాత్మక కళ అని, వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్న కళాకృతులు ప్రజల్లో స్ఫూర్తిని, ప్రేరణను కలిగిస్తాయని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 84వ ఆల్ ఇండియా వార్షిక ఆర్ట్ ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిత్రకారులకు అవార్డులు అందజేసి అభినందించారు. కళారంగంలో సమాజంలో శక్తివంతమైన పాత్ర పోషిస్తుందన్నారు. సుదీర్ఘకాలంగా హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ పెయింటింగ్ పోటీలు నిర్వహించి సృజనతో సత్తాచాటిన చిత్రకారులకు పురస్కారాలు అందజేయడం సంతోషకరమన్నారు. ఈ తరహా కార్యక్రమాలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి ఆహూతులకు స్వాగతం పలికారు. అవార్డు ఉత్సవాల కన్వీనర్ సామల వేణు, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ ప్రభాస్ శంకర్, గంగాధర్, ఆదిత్య మార్గం, ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ట్ ఎగ్జిబిషన్, సావనీర్ గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి



సేవాలాల్ జయంతి వేడుకల్లో కిషన్‌రెడ్డి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం పాటుపడి ఉందని, బంజారా భాషకు గుర్తింపు దిశగా కృషి చేస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారతదేశపు మూల పురుషులైన గిరిజనులను గౌరవించుకోవడం తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతిలో బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్ ఆధ్వర్యంలో జరిగిన సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకల్లో భాగంగా భోగ్ బండార్ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భోగ్ బండార్ హోమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన జాతిని చైతన్య పరిచేందుకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని అన్నారు. ధర్మబద్ధంగా నడుచుకోవడం, ఆధ్యాత్మిక జీవనశైలిని అనుసరించడం, ప్రకృతిని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని సేవాల్ మహారాజ్ ఆచరించి చూపించారన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుల స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బంజారాలు, ఆదివాసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ్ నేతలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడే వారికి ప్రోత్సాహం అందించాలి



రైజింగ్ తెలంగాణ అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు పాటుపడే వారికి ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో రైజింగ్ తెలంగాణ - 2025 పేరిట జేఎంజీ సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ కింద వైద్య, విద్య, సేవా రంగాల్లో రాణిస్తున్న వారికి అందించే అవార్డుల బ్రోచర్‌ను గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డులు గ్రహీతల్లో మరింత బాధ్యత పెంచుతాయన్నారు. ఏప్రిల్ 20 వరకు నామినేషన్లు స్వీకరించి 30న అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు జగన్నాథం మాదిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

'బాహ సే ఇండియా 2025' ప్రత్యేకం



సమావేశంలో మాట్లాడుతున్న బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం

బేగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాహ సే ఇండియా-2025 చాల ప్రత్యేకమని బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం అన్నారు. సొసైటీ ఆఫ్ ఆటో మోటివ్ ఇంజనీర్స్ శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల బాహ సే ఇండియా-2025 ఈవెంట్ వివరాలను బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2015లో కేవలం 7 జట్లతో ప్రారంభమైన ఈ బాహ సే ఇప్పుడు 85 పైగా జట్లు పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఆటో మొబైల్ పరిశ్రమకు చెందిన సంస్థలు ఈ పోటీపై ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందిస్తున్నాయన్నారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ యువ ఇంజనీరింగ్ ప్రతిభకు గొప్ప వేదిక అన్నారు. ఇది పోటీయే కాదని, యువ ఇంజనీర్లు తమ అభిరుచిని వృత్తిగా మార్చుకునే వేదిక అని పేర్కొన్నారు. ఈసమావేశంలో సియోనా అడెలినా పోపోబస్, బాహ సే ఇండియా కన్వీనర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని బీసీ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్గొండ - వరంగల్ - ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి సుందర్ రాజ్ యాదవ్, కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణను గెలిపించాలన్నారు. పోటీలో ఉన్నవాళ్లలో బీసీల కోసం నిలబడే నాయకులకు మద్దతు తెలుపాలన్నారు. ఇద్దరు బీసీలను గెలిపించుకుంటే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయన్నారు. గతంలో బీసీ కార్డ్‌తో గెలిచిన వాళ్ళతో ఒరిగిందేమి లేదని, ఈసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. సామాజిక స్పృహ కలిగిన సుందర్ రాజు యాదవ్, ప్రసన్న హరికృష్ణను గెలిపించుకోవాలని ఆయన బీసీలను కోరారు. సమావేశంలో సమితి నాయకులు దామోదర్, మహేష్, రాజు అతికం, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. 100 ఫీట్ల రోడ్డా!

గంటల తరబడి ట్రాఫిక్.. పద్మవ్యూహంలో నిరీక్షణ

- ఫ్రీ లెఫ్ట్ రూల్స్‌ను సైతం పాటించని వాహనదారులు
- మధ్యాహ్న సమయంలో భానుడి భగభగ
- కాళ్ళ కింద తారు రోడ్డు సెగలు..
- అవస్థలు పడుతున్న నగర ప్రజలు
- కనిపించని ట్రాఫిక్ సిబ్బంది

> హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు... కానీ మాదాపూర్‌లోని 100 ఫీట్ల రోడ్డులో ప్రయాణం అంటేనే నగర ప్రజలకు తలనొప్పి తెచ్చి పెడుతోంది. పెరిగిన వాహనాలు, ఇరుకైన రోడ్లు, విపరీతమైన రద్దీ కారణంగా వాహనదారులు పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌లో చిక్కుకొనిపోతున్నారు. ఎలాగైనా ట్రాఫిక్‌లో నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను సైతం పాటించడం లేదు.



ఫ్రీ లెఫ్ట్ బోర్డులు ఉన్నా పాటించని వాహనదారులు

మోతీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 100 ఫీట్ల రోడ్డు పర్వత్‌నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉదయం, సాయంత్రం సమయంలో మినహా మిగిలిన సమయంలో సిగ్నల్ వ్యవస్థను ఆటోమేటిక్ మూడ్‌లో ఉంచి వెళ్లిపోతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి పది గంటల వరకు మాదాపూర్ పర్వతనగర్ జంక్షన్ నుంచి అటు సైబర్ టవర్స్, హైటెక్ సిటీ, అయ్యప్ప సొసైటీ వైపు వెళ్లాలన్నా, ఇటు కేపీహెచ్‌బీ కైతలాపూర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లాలన్నా, అదేవిధంగా మాదాపూర్ పోలీస్ స్టేషన్, నీరుస్ చౌరస్తా వైపు రాకపోకలు సాగించాలన్నా పర్వత్‌నగర్ సిగ్నల్ దాటాలంటే సుమారు 30 నిమిషాల నుంచి గంట సమయం పడుతోందంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నీరుస్ చౌరస్తా నుంచి అయ్యప్ప సొసైటీ, 100 ఫీట్ల రోడ్డు వైపునకు వెళ్లేందుకు పర్వత్‌నగర్ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్ బోర్డ్ సైతం ఉన్నప్పటికీ రద్దీ కారణంగా వాహనదారులు ఫ్రీ లెఫ్ట్ మార్గాన్ని సైతం ఆక్రమించేస్తున్నారు. దీంతో ఆ వైపు వెళ్లే వాహనదారులు సైతం గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుండడంతో కిలో మీటర్ పొడవున వాహనాలు నిలిచిపోతున్నాయి.



మధ్యాహ్న సమయంలో ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

12 నుంచి 4 గంటల వరకు..

మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు నెత్తిన భానుడి భగభగలు... కాళ్ల కింద తారు రోడ్డు సెగల మధ్య ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులతో పాటు చిన్నపిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి అనునిత్యం విపరీతమైన ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే 100 ఫీట్ల రోడ్డును వెడల్పు చేయడంతో పాటు పర్వత్‌నగర్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది పగటి సమయం పూర్తిగా అందుబాటులో ఉండేలా చూడాలని వాహనదారులు కోరుకుంటున్నారు.



పర్వత్ నగర్ సిగ్నల్ వద్ద అన్ని వైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు





టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చిన అక్రమ నిర్మాణం(ఫైల్),



అధికారులు కూల్చాక మళ్లీ నిర్మించిన అక్రమ నిర్మాణం

పడగొట్టినా నిర్మిస్తాం!

- ప్రభుత్వం స్థలం అన్యక్రాంతం

బోరబండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ మహాత్మానగర్ సర్వే నంబర్ 127లో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై బస్తీ నాయకులు ఆనంద్‌కుమార్ స్థానిక మహిళలతో కలిసి ప్రజాపాలన, ప్రజావాణి, సికింద్రాబాద్ ఆర్డీఓ, ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులకు పలుమార్లు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్-19 టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని 3 నెలల క్రితం కూల్చివేశారు. సెలవు రోజులు చూసి అధికారులు ఇటు వైపు ఎవరూ రారని కబ్జాదారులు మళ్లీ నిర్మాణం చేపట్టారు. బస్తీ ప్రజల అవసరాల కోసం కేటాయించిన స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పడగొట్టిన ఇంటిని తిరిగి నిర్మించారని బస్తీ ప్రజలు రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు.

వాంబే ఇళ్లను కూల్చి భవనం నిర్మిస్తున్నారు

- జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వాంబే పథకం కింద నిర్మించిన ఇళ్లను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయడమే కాకుండా వాటిని కూల్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారని జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకుడు బోపురం వేణుకుమార్ ఆరోపించారు. ఈ మేరకు సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిలింనగర్ గౌతంనగర్‌లో గతంలో కేంద్ర ప్రభుత్వం వాంబే పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టి అందజేసిందన్నారు. పేదలకు డబ్బు ఆశ చూపించిన ఓ వ్యాపారి ఒకే సారి ఐదు పట్టాలు అక్రమ మార్గంలో కొనుగోలు చేసి వాటిని కూల్చివేశాడని, ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నాడని ఆరోపించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, వెంటనే నిర్మాణ దారుడిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముఠా

- డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ
- ఒక మహిళ, నలుగురు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లో మిట్ట మధ్యాహ్నం గంజాయి సేవిస్తున్న ముఠాను మాదాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఒక మహిళ సహా.. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్స్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దాంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానామెట్‌లోని జీఆర్‌సీ (జి.రామచంద్రా రెడ్డి) రెసిడెన్సీలో నివాసం ఉంటున్న అక్కిరెడ్డి వెంకటేశ్ తన స్నేహితులతో కలిసి గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు మధ్యాహ్నం సమాచారం అందింది. దాంతో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి నిందితులు అక్కిరెడ్డి వెంకటేష్, పి. విజయరెడ్డి, ఎం.రాహుల్, ఎస్.శివకుమార్, ప్రియాంకరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్స్ కిట్స్‌తో యూరిన్ పరీక్షలు నిర్వహించగా గంజాయి తీసుకున్నట్లు తేలింది. దాంతో వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులందరూ నిజామాబాద్‌కు చెందిన వ్యక్తులు కాగా.. వారితో పట్టుబడ్డ మహిళ ప్రియాంక రెడ్డిది హైదరాబాద్‌గా గుర్తించామన్నారు. వారికి గంజాయి విక్రయించిన నిందితులు ఎవరు..? ఎక్కడి నుంచి గంజాయి తెస్తున్నారు..? ఎంతకాలంగా ఈ ముఠాకు విక్రయిస్తున్నారు..? వీరితో పాటు ఈ ముఠాలో ఇంకా ఎంతమంది ఉన్నారు..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ప్రియాంకరెడ్డి గతంలోనూ గచ్చిబౌలి పరిధిలో డ్రగ్స్ తీసుకుంటూ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. ఆర్కిటెక్చర్‌గా చేస్తున్న ఆమె అప్పట్లో కొరియోగ్రాఫర్, వారి స్నేహితులతో కలిసి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటుండగా.. సైబరాబాద్ ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు గతేడాది డిసెంబర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా.. ఇప్పుడు గంజాయి తీసుకుంటూ మాదాపూర్ చిక్కి అరెస్టయినట్లు ఆమె అని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

వివాహిత ఆత్మహత్య



దీపిక (ఫైల్)

హైదర్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన అప్పాల వేణుగోపాల్‌తో హనుమకొండకు చెందిన కొసనం దీపిక(27)కు 2019లో పెద్దలు వివాహం జరిపించారు. ప్రస్తుతం వీరు తమ 13 నెలల కుమారుడితో కలిసి నిజాంపేట రోడ్డులోని నాగార్జున హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వివాహమైన ఏడాది నుంచే దంపతుల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. వివాహ సమయంలో వ్యాపారం చేసిన వేణుగోపాల్ తర్వాత ఏ పని చేయకుండా దీపికను వేధించాడని దీపికా తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం వేణుగోపాల్ బయటకు వెళ్లిన సమయంలో తలుపులు వేసుకున్న దీపిక సాయంత్రం ఆమె సోదరుడు తన చెక్ బుక్ కోసం వచ్చి తలుపు కొట్టగా గది లోపల నుంచి పిల్లవాడు ఏడుస్తున్నట్లు చప్పుడు తప్ప మరే స్పందన లేకపోవడంతో తలుపులు పగలగొట్టి చూసే సరికి దీపిక బెడ్ రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. తమ కుమార్తెను అదనపు కట్నం కోసం వేణుగోపాల్ తరుచూ వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని దీపిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడు వేణుగోపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

యువకుడి అదృశ్యం

హైదర్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ వివాహిత కోసం కూకట్‌పల్లికి చెందిన ఓ యువకుడు ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్తీరాం కుమావత్ అనే వ్యక్తి కేపీహెచ్‌బీ ఫేజ్-4లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరి రెండో కుమారుడు పవన్ కుమావత్(21) ఈనెల 6న ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. రెండురోజుల తర్వాత కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని, పూణే నగరానికి దగ్గరలో గుర్తుతెలియని ప్రదేశంలో ఉన్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో తండ్రి బస్తీరాం కుమావత్ కొడుకు స్నేహితులు వద్ద విచారించాడు. పవన్‌కు ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వివాహితతో పరిచయం ఏర్పడిందని ఆమెకు ఓ కుమారుడు సైతం ఉన్నాడని, ఆ మహిళ కారణంగానే తమ కుమారుడు ఇల్లు విడిచి వెళ్లాడని తెలుసుకున్నారు. తమ కుమారుడి కోసం ఫోన్ చేసిన ప్రతిసారి సదరు మహిళ ఫోన్ ఆన్సర్ చేసి తమకు ఫోన్ చేయవద్దని ఫోన్ చేస్తే పవన్‌ను చంపుతాను, చస్తానని బెదిరిస్తోందని బస్తీరామ్ గురువారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీ దవాఖానాల తనిఖీ



బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) సూచించారు. గురువారం బస్తీ దవాఖానాలు, శ్యామ్‌లాల్ బిల్డింగ్, పోల్‌దాస్ పట్టణ ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ)ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రోగులను పరీక్షించారు. వైద్య సేవలు, చికిత్స, వసతులు, మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. అందించిన సేవలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రతీరోజూ బస్తీ దవాఖానాలను తనిఖీ చేస్తున్నట్లు డాక్టర్ వెంకటి తెలిపారు. ఎక్కడైనా మందుల కొరత ఉంటే, సమీపంలోని దవాఖానాల నుంచి కొరతగా ఉన్న చోటకు తరలిస్తున్నట్లు తెలిపారు.

సైన్స్‌తో కనెక్ట్ అయ్యారు!

- హాజరైన 20 కళాశాలల విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యూసఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'సై-కనెక్ట్' కార్యక్రమాన్ని స్పేస్ ఆర్కిటెక్ట్ శశాంక్ భూపతి ప్రారంభించారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన సైన్స్ విద్యార్థుల ప్రతిభను పరీక్షించడంతో పాటుగా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్లు దీప్తి, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా సై - కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వస్తున్నామని, ఈ సంవత్సరం 20కు పైగా డిగ్రీ కళాశాలలతో పాటుగా పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. సాంకేతిక, సాంకేతికేతర అంశాల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షించేందుకు నిర్వహించిన స్టాట్ ఓ లక్, బ్రెయిన్ బజ్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, బీట్ ద క్లాక్, మిస్టిక్ హంట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల బయాలజీ, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, ఐటీ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మహిళా డిగ్రీ కళాశాలలో 'క్యాంపస్ మార్ట్'



కళాశాలలో క్యాంపస్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

బేగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో క్యాంపస్ మార్ట్ నిర్వహించారు. ఇందులో 55 ఫుడ్ స్టాల్స్, 22 బిజినెస్ స్టాల్స్, 12 గేమ్స్ స్టాల్స్ ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్ మార్ట్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినీల్లో నైపుణ్యాలను, వాణిజ్య దృక్పథాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి క్యాంపస్ మార్ట్‌లను ప్రతి సంవత్సరం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు పల్లవి, ప్రసన్న

బేగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్లు పల్లవి, ప్రసన్న అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ, పోలీస్ శిక్షణా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై ఎస్ఐ పల్లవి అవగాహన కల్పించగా, మహిళా భద్రతా అంశాలపై ఎస్ఐ ప్రసన్న ప్రసంగించారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రొ. రాజ్‌కుమార్ ప్రసంగించారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న కోట నీలిమ, విశాల్ సుధాం

బేగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. గురువారం బేగంపేట డివిజన్ సింధికాలనీలోని సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో కాంగ్రెస్ నేత విశాల్ సుధాం ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్రగతి సమీక్షా సమావేశానికి కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ప్రజల సమస్యలను ఆమె తెలుసుకున్నారు. బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, హనీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాండుయాదవ్

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన సక్కుబాయికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆమె కుటుంబీకులకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. గురువారం మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో స్థానిక బోర్డు సభ్యుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.35 వేల చెక్కు అందించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విక్టరీ గుర్తు చూపుతున్న విద్యార్థినులు, బీఆర్ఎస్ నాయకుడు టింకు గౌడ్, ఉపాధ్యాయులు

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలకు విద్యార్థినులు ఎంపికయ్యారు. హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు బోయిన్‌పల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన తులసి, మంగాయమ్మ, విజయలక్ష్మి, లోహిత, వాసిని, దివ్యలు సెలెక్ట్ కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. అయితే క్రీడాకారిణులు హైదరాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. అభినందనలు తెలిపిన వారిలో బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ లీల. బిఆర్ఎస్ నాయకుడు టింకు గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్ దీపిక విస్తృత పర్యటన



కుమ్మరిగూడలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న దీపిక

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో బీజేపీ మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, అధికారులు గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కుమ్మరిగూడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఎలుకలతో ఇబ్బందులు పడుతున్నామని, ఇనుప ర్యాక్‌లు కావాలని కోరడంతో వెంటనే ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అయితే బండిమెట్‌లో కొన్ని నెలల నుంచి లో- ప్రెషర్ వాటర్ సరఫరాతో పాటు కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు రావడంతో వాటర్ వర్క్స్ మేనేజర్ మనోహర్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీహరి.. పరిశీలించి చర్యలు తీసుకుంటానని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. సెకండ్ బజార్లో రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని దీపిక అన్నారు. అంతకుముందు టీచర్స్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పటాన్‌చెరువు మండల ఇన్‌చార్జితో కలిసి ఆమె పాల్గొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించడంలోనూ ముందుటానన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సబ్‌ఇన్‌స్పెక్టర్లు పల్లవి, ప్రసన్న

బేగంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సబ్‌ఇన్‌స్పెక్టర్లు పల్లవి, ప్రసన్నలు అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ, పోలీస్ శిక్షణా కళాశాల ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులకు సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మహిళా భద్రతా అంశాలపై షీటీం తదితర విభాగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రొ. రాజ్‌కుమార్ ప్రసంగించారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చేదెన్నడో?

సింటెక్స్ ట్యాంకులు నిరుపయోగం ● పాడైన మోటార్లు, తెగిన విద్యుత్ వైర్లు

- గృహ అవసరాలకు వేధిస్తున్న నీటి కొరత
- ఇబ్బందుల్లో బస్తీవాసులు

సింటెక్స్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. దీంతో అడ్డగుట్ట పరిధిలోని బస్తీవాసులు.. గృహ అవసరాలకు నీటి కొరతతో సతమతమవుతున్నారు. విద్యుత్ కనెక్షన్‌ల వైర్లు తెగిపోవడంతో పాటు మోటార్లు పాడైపోవడమే కారణమని తెలుస్తోంది. వాటిని మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నా జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రాబోయేది వేసవి కాలం కాబట్టి ఇబ్బందులు తీవ్రతరం అవుతాయని బస్తీవాసులు చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

అడ్డగుట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో 15 సింటెక్స్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. సీసీఐ కార్యాలయం పక్కన, అడ్డగుట్ట ఏ, బీ సెక్షన్‌తో పాటు అడ్డగుట్ట సాయినగర్, వెంకట్‌నగర్, అడ్డగుట్ట బస్టాపు, లోహియ నగర్ ప్రాంతాల్లో ఈ దుస్థితి కనిపిస్తోంది. అలాగే అడ్డగుట్ట బస్టాప్ ఎదురు, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్, అడ్డగుట్ట డి సెక్షన్, తుకారాంగేట్ చౌరస్తా, వెంకట్‌నగర్, ఇందిరాలక్ష్మీ నగర్, కేజీ ఆస్పత్రి ఎదురుగా తదితర ప్రాంతాల్లోనూ ట్యాంకులు, వీటికి విద్యుత్ కనెక్షన్‌ల వైర్లు సైతం తెగిపోయాయి. బోర్లు సైతం పాడైపోయాయి. దీంతో స్థానికులు గృహ అవసరాలకు నీటి కొరత ఏర్పడుతోంది. నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అలాగే కమ్యూనిటీ హాలు నుంచి (10-4-920) ఇంటి ఎదురుగా ఉన్న సింటెక్స్‌కు సంబంధించిన చిన్న ఇనుప పైప్‌లైన్ తుప్పు పట్టి పగిలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ట్యాంకులున్నా గానీ మోటార్లు లేవు. అన్ని సవ్యంగా ఉన్న ప్రాంతాల్లో బోరు నుంచి నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్‌లను ఆశ్రయిస్తున్నారు.

రెండేళ్లుగా ప్రతికూల పరిస్థితులు మధ్య బతుకుబండిని ఎలాగోలా నడుపుకుంటూ వస్తున్నారు. ఈ వేసవి కాలం నీటి సమస్యలు తీవ్రతరమయ్యే అవకాశం ఉండటంతో ముందస్తుగా జలమండలి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మేల్కొని మరమ్మతులైనా చేపడితే ఆయా ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని బస్తీ వాసులు కోరుతున్నారు.



అడ్డగుట్ట మజీద్ పక్కన పాడైన సింటెక్స్ ట్యాంక్



సీపీఐ కార్యాలయం పక్కన దుస్థితి

నిదర్శనం

అడ్డగుట్ట డివిజన్‌లో కేజీ ఆస్పత్రి వద్ద, మాజీ కార్పొరేటర్ రత్న కుమారి ఇంటి సమీపంలో పవర్ బోర్‌లు పాడైపోయి ఏడాది అవుతోంది. ఇప్పటి వరకు అధికారులెవరూ పట్టించుకోలేదు.



ఓ ఇంటి ఎదురుగా నిరుపయోగంగా మారిన ట్యాంక్

సమస్యలపై జీఎంకు విన్నవించాను



అడ్డగుట్ట డివిజన్‌లోని సింటెక్స్ ట్యాంకులు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. మోటార్లు చాలా చోట్ల పాడైపోయాయి. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రానున్న వేసవి కాలంలో ఇది ఇబ్బందయ్యే అవకాశం ఉంది. ఏదిఏమైనా వాటిని బాగు చేయాల్సిన అవసరం ఉంది. నేను రెండు రోజుల క్రితం మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్‌కు వినతి పత్రం సమర్పించాం.

\- సౌందర్య, బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు



బోయిన్‌పల్లి స్థానిక సంబురాలు చేసుకుంటున్న నర్మదమల్లికార్జున్



మెట్టుగూడలో మహిళకు మిఠాయి తినిపిస్తున్న మల్లీశ్వరపు రాజేశ్వరి

బీజేపీ శ్రేణుల సంబురాలు

రేఖాగుప్తా ఢిల్లీ సీఎం కావడంపై పార్టీ మహిళా నేతల హర్షం

సికింద్రాబాద్, బోయినపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేయడంతో గురువారం లష్కర్‌లో బీజేపీ నేతలు సంబురాలు జరుపుకొన్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. పార్టీలోని మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది అనడానికి ఇదే తార్కాణమని నినాదాలు చేశారు. పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళా ముఖ్యమంత్రిగా నియమితులైన కీర్తిలో రేఖా గుప్తా కూడా చేరారని కేరింతలు కొట్టారు.

మల్లీశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో..

మెట్టుగూడలో బీజేపీ ఓబీసీ విభాగం రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లీశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. స్థానిక మహిళలకు మిఠాయిలు తినిపించారు. బీజేపీ మహిళా పక్షపాతి అంటూ వారికి ఆమె తెలిపారు. శ్రీధర్‌గుప్తా, ప్రశాంత్, శ్రీను, రాజ్యలక్ష్మిగుప్తా, కాశమ్మ, జాన్సి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

బాణుక నర్మద ఆధ్వర్యంలో

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మద మల్లికార్జున్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న బీజేపీ బోయిన్‌పల్లి మహిళలతో కలిసి ఆమె గురువారం వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం.. ప్రధాని మోదీ నాయకత్వంలో.. మహిళలకు గొప్ప అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రపతిగా ముర్ము, కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్‌లు కొనసాగడమే అందుకు నిదర్శనమన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మహిళలకు బీజేపీ పెద్దపీట వేసిందన్నారు. అదేవిధంగా రాబోయే రోజులలో కంటోన్మెంట్‌లోను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ల ప్రోత్సాహంతో రాజకీయపరంగా మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తూ వారిని గౌరవిస్తారనే విషయంలో ఎటువంటి సందేహం లేదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ 6వ వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, మహిళా నాయకురాళ్లు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

యువ ఇంజినీర్ల అభిరుచి వేదిక

బాహా సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు

బేగంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాహ సే ఇండియా 2025 చాలా ప్రత్యేకమని బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రమణ్యం, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య అన్నారు. 'బాహ సే ఇండియా 2025' ఈవెంట్ వివరాలను బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. 2015లో కేవలం 7 జట్లతో ప్రారంభమైన బాహ సే ఇండియా ఇప్పుడు 85 పైగా జట్లు పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గల బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఈవెంట్ జరుగుతోందన్నారు.ఆటోమొబైల్ పరిశ్రమకు చెందిన సంస్థలు ఈ పోటీపై ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందిస్తున్నయన్నారు. ఈ ఈవెంట్ యువ ఇంజినీరింగ్ ప్రతిభకు గొప్ప వేదిక అన్నారు. ఇది పోటీయే కాదని, యువ ఇంజినీర్లు తమ అభిరుచిని వృత్తిగా మార్చుకునే వేదిక అని పేర్కొన్నారు. సమావేశంలో సియోనా అడెలినా పోపోబస్ , బహ సే ఇండియా కన్వీనర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలరాజు, ఆదిత్య తదితరులు

● అమరులకు నివాళి



యాదయ్య, జాన్సీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం, బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ కోసం ఆత్మార్పణ చేసుకున్న సిరిపురం యాదయ్య, బీజేపీ జెడ్పీటీసీ సభ్యురాలు వనం జాన్సీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. వారాసిగూడలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రేటర్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్, వారాసిగూడ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు, ఉస్మానియా వర్శిటీ విద్యార్థి సంఘం నాయకుడు ఎనగంటి రాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఆఇద్దరి చిత్రపటాల వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజు, కె.లక్ష్మణ్, వి.సుమన్, బలరాం పాల్గొన్నారు.

● మర్యాదపూర్వక కలయిక



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాదరి కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మోండా మార్కెట్‌లోని తీగుళ్ల నివాసం ఇందుకు వేదికైంది. పద్మారావు గౌడ్ కొన్ని రోజులు క్రితం అనారోగ్యానికి గురై కోలుకున్న విషయం విదితమే.

\- (రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)

● డిగ్రీ కళాశాలలో 'క్యాంపస్ మార్ట్' ప్రారంభం



క్యాంపస్‌మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

బేగంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో క్యాంపస్ మార్ట్ నిర్వహించారు. ఇందులో 55 ఫుడ్ స్టాల్స్, 22 బిజినెస్ స్టాల్స్, 12 గేమ్స్ స్టాల్స్ కలిగిన మార్ట్ కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులలో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. వాణిజ్య దృక్పథాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

● సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. గురువారం బేగంపేట డివిజన్‌లోని సింధికాలనీలో గల సిల్వర్ జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో కాంగ్రెస్ నేత విశాల్ సుదాం ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్రగతి సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బస్తీలు, కాలనీలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, హనిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

చిలకలగూడ పీఎస్ పరిధిలో ఘటన

బౌద్ధనగర్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడలో భార్యాభర్తలు పవన్ పాశ్వాన్, మిథిలేష్‌దేవి అలియాస్ పూజాదేవి నివసిస్తున్నారు. వీరికి సౌరభ్‌కుమార్, కృష్ణకుమార్, రిషిక కుమారి అనే ముగ్గురు పిల్లలున్నారు. పవన్ సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్‌లో పనిచేస్తుంటాడు. పూజాదేవి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న మరో హోటల్‌లో వర్క్ చేస్తోంది. రోజూ పవన్ తెల్లవారుజామున 4 గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికొస్తాడు. ఈనెల పదో తేదీన కూడా సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వస్తే అప్పటికే తాళం వేసి ఉంది. పక్కింటి వారిని అడుగగా అదేరోజు ఉదయం ఐదు గంటలకు తాళం వేసి పిల్లలను తీసుకుని పూజాదేవి వెళ్లిందని తెలిపారు. వారి గురించి తెలిసిన వారి వద్ద వెతికినా కనిపించకపోవడంతో అదృశ్యంపై చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుంతల ప్రయాణం.. ఒళ్లు హూనం

- అంతర్గత రహదారులు అధ్వానం
- ఇబ్బందుల్లో వాహనదారులు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో అంతర్గత రహదారులు గుంతలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల దారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని వాపోతున్నారు. డిస్టిలరీ రోడ్డు రైల్వే బ్రిడ్జి సమీపాన, రంగ్రేజ్ బజార్‌లో, కళాసీ గూడలో, నల్లగుట్ట, వెంగళరావు నగర్, బాహు బాగ్ తదితర ప్రాంతాలలో ఈ దుస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లో అంతర్గత రహదారులు పాచ్‌వర్క్‌ల వల్ల గుంతలమయం కాగా, పైకి కంకర తేలింది. కాగా, ఈ దారుల గుండా ప్రయాణించే వాహనదారుల ఒళ్లుహూనమవుతోంది. ఇంకోవైపు పలు ప్రాంతాలలో వాటర్ వర్క్స్ వారు పైపు లైన్ల కోసం తవ్విన రోడ్లను తగిన రీతిన పూడ్చకపోవడం వల్ల కంకర తేలుతుంది. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో వల్ల రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



డిస్టిలరీ రోడ్డులో ఏర్పడిన గుంతలు



జీఎస్టీ కార్యాలయం వద్ద రహదారి దుస్థితి

ఈ వ్యథ ఇంకెన్నాళ్లు..



ఎన్నాళ్లీ వ్యథను అనుభవించాలి. నాకు ఊహ తెలిసిన నాటి నుంచి అంతర్గత రహదారులు అధ్వానంగానే ఉంటున్నాయి. అసలు అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. బంజారా హిల్స్ జూబ్లీహిల్స్, హైటెక్ సిటీలలో అంతర్గత రహదారులు ఎంత నీట్‌గా ఉంటాయి. ఇక్కడెందుకు ఉండవు?.. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి పెట్టాలి.

\- గౌరీనాథ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రోడ్డు పూర్తిగా ధ్వంసం



డిస్టిలరీ రోడ్డులోని రైల్వే వంతెన కింద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సంవత్సరాల నుంచి సమస్య అపరిష్కృతంగానే ఉంది. అప్పుడప్పుడు నామ్‌కే వాస్తేగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మరోవైపు రైల్వే వంతెన మీద నుంచి రైలు వెళుతుంటే రైలులో నుంచి ఎక్కడ వ్యర్థాలు పడతాయోనని బైకిస్టులు వాహన వేగాన్ని తగ్గించడమో లేకుంటే ఆపి వేయడమో చేస్తున్నారు.

\- బొల్లు శ్రీనివాస్ (వాసు), పాన్‌బజార్ నివాసి